# కథ

పి.వి.రమణకుమార్

# నటనట చాలించరా...!

"అంబ పలికింది కుర్రోకుర్రు
కొండ దేవర సెపుతుండ
మంచి మొగుడొస్తడు నీకు..."

కోయదొర కేకలు విని బాత్‌రూమ్‌లోంచి తుండు చుట్టుకొని జెట్‌స్పీడ్‌తో బైట వరండాలోకి వచ్చాడు సుందరబాబు.

అక్కడ పుష్ప కోయదొర మాటలకు సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ కనిపించింది.

"పెళ్లి ఊసెత్తితే చాలు ఎంత సిగ్గో తల్లి నీకు కుర్రోకుర్రు.... ఉత్సాహంగా చెప్పాడు కోయదొర.

"ఓరి నీ జోస్యం తగలెయ్య! దానికి పెళ్లయి పదేళ్లయ్యింది. ఆవిడ మొగుడ్ని నేనే" విరుచుకు పడ్డాడు సుందరబాబు.

కోయదొర సుందరబాబు కేసి, పుష్పకేసి ఎడాపెడా రెండుసార్లు చూసి "నిజం సెప్పు తల్లి! గుడిలో గంటలు కాజేసే వాడిలా ఉన్న ఈ గుండు నీ మొగుడా తల్లి?" అన్నాడు.

పుష్ప ఇబ్బందిగా మొఖం పెట్టి 'అవునన్నట్లు' తలాడించింది.

"కుర్రోకుర్రు.. ఎక్కడో పొరపాటు జరిగిందే తల్లి" ఇంకా ఏదో చెప్పబోతుండగా..

"ఇంక అట్టే వాగావంటే నీ తలకాయ కొబ్బరికాయలా పగిలిపోతుంది. లేచి ఇక్కడ్నుంచి వెళ్లు" ఆవేశంతో ఊగిపోయాడు సుందరబాబు.

అతని ఉగ్రరూపాన్ని చూసి కొద్దిగా జంకిన కోయదొర బిత్తర చూపులు చూశాడు. పుష్ప భర్తవైపు కొరకొరా చూస్తూ "వెళ్లి స్నానం పూర్తి చేసిరండి.. మధ్యలో కల్పించుకుని పాపం కోయదొరకు బంగారం లాంటి మూడ్ చెడగొట్టారు. అసలు నా మనసులో విషయం ఇంతవరకూ చెప్పనే లేదు" అంది.

పుష్ప సపోర్ట్‌తో కోయదొర మీసం దువ్వుకుంటూ తిరిగి తన మూడ్‌లోకి వెళ్లిపోతూ.. "అద్గదీ సంగతి ఇప్పుడు అంబ పలికింది కుర్రోకుర్రు. పెళ్లయ్యి పిల్లల్లేక పిచ్చి మొఖాల్లా ఉన్నారు. వచ్చే శ్రీరామనవమి కల్లా పండంటి దొర మీకు పుడతాడే తల్లీ... ఇది ఈ కోయదొర సెప్పే మాట కుర్రోకుర్రు" అన్నాడు.

ఈ మాటలతో ఈసారి పుష్ప గతుక్కుమంది. సీరియస్‌గా నొసలు చిట్లించి చూసింది. అప్పటికే తిక్క రేగిపోయి ఉన్న సుందరబాబు.

"ఒరేయ్ నువ్వు ముందిక్కడ్నుంచి వెళ్లు. ఇప్పుడు పిల్లలు పుట్టడేమిట్రా! మా అబ్బాయిని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించి మరీ చదివిస్తుంటేనూ!" అన్నాడు.

కోయదొర ఉలిక్కిపడి వీపుమీద రెండుసార్లు గుద్దుకొని "అరరే... మొగుడు మారిపోవడంతో నీ జాతకం కూడా మారిందే తల్లి! కొండదేవర పలుకేమిటంటే ఇలాంటి మొగుడితో ఇంత ఛండాలపు జాతకమే తయారయిందే తల్లి జాతకం మారాలంటే!"

"ఏం చేయాలి?" అడిగింది.

"మొగుడ్ని మార్చేయాలి తల్లి!" కుర్రోకుర్రు.. చెప్పాడు కోయదొర.

"ఈ దెబ్బతో నీ తలకాయ మారుస్తాన్రా! ఒరేయ్. మా కాపురంలో కారుచిచ్చు పెడతావా?" కలబడేందుకు ముందుకు దూకాడు సుందరబాబు.

"కారుచిచ్చు లేదు. లారీ చిచ్చు లేదు. అసలు కోయదొర ఒడిలో నుంచి అసలైన పలుకులు రానే లేదు" విసవిసలాడింది పుష్ప.

"పుష్ప నీకేం తెలీదు. ఇలాంటి దొంగ జోతిష్యుల మాయమాటలు నమ్మకూడదు. అసలైనా పొద్దున్నే వీడెలా తగలడ్డాడే?"

"అంత ఇష్టం లేకపోతే పోనే! మా కష్టం మాకిప్పించండి తల్లి! మీ మొగుడు నా బుర్ర పగులకొడతాడేమో తల్లి" మూట సర్దుకున్నాడు కోయదొర.

పుష్ప తీవ్రంగా నిట్టూరుస్తూ పది రూపాయల కాగితం కోయదొర చేతిలో పెట్టింది. కోయదొర అసంతృప్తిగా చూస్తూ-

"నీ మొగుడు గుంటడి ప్యాంటూ.. చొక్కా ఇప్పించవే తల్లి కొండదేవర కూల్‌గ చూత్తడు" అన్నాడు.

"ఇక్కడ్నుంచి వెళ్లకపోతే ఒక దెబ్బతో కైలాసాన్ని చూస్తావ్" అంటూ పిడికిలి బిగించి పైకెత్తాడు సుందరబాబు స్టంట్‌మాస్టర్‌లా.

"చచ్చాన్రా దేవరో.. కుర్రోకుర్రు" అంటూ తన కర్రకు మూట తగిలించుకుని పరారయ్యాడు కొన్ని క్షణాల్లోనే కోయదొర.

"ఇప్పుడు మీ కడుపుమంట చల్లారిందా!" ఉక్రోషంగా అడిగింది పుష్ప.

"అది కాదే పుష్ప.. ఇలాంటివాళ్లని నమ్మకూడదు. వాడసలు అన్ని విషయాలు తప్పే చెబుతున్నాడు గదా! ఇంకా ఆ మూఢనమ్మకమేంటి?" నిలదీశాడు.

ఇంతలో విసవిసా పక్కింట్లోంచి వచ్చేసింది కామేశ్వరి.

"అయ్యో ఏడీ? అప్పుడే వెళ్లిపోయాడా కోయదొర. నేనే ఇక్కడికి పంపించాను" చెప్పింది.

"ఇదంతా తమరి డైరక్షనా కామేశ్వరి పిన్నీ?" అడిగాడు సుందరబాబు.

"అయ్యో! నువ్వు ఇక్కడే ఉన్నావా బాబూ? ఇదిగో పుష్పా! ఇలా కోయదొరల దగ్గర.. సోది బూదెమ్మల దగ్గర విషయాలు అడిగేటప్పుడు పక్కన మొగుడుండకూడదు. వాళ్ల నోటి వెంట సత్తెం పలుకదు" గొంతు తగ్గించి రహస్యంగా చెప్పింది కామేశ్వరి.

"ఛీ... ఈ జన్మలో మీరు బాగుపడరు" విసుగ్గా తిరిగి బాత్‌రూమ్‌లోకి వెళ్లిపోయాడు సుందరబాబు.

సుందరబాబు చిన్న ఉద్యోగి. అన్ని విషయాల్లోనూ బాగానే ఉంటాడు. కాకపోతే అప్పుడప్పుడూ ఆఫీస్‌కు సెలవు పెట్టి తన టీమ్‌తో కలసి నాటకాలు ఆడుతుంటాడు. పరిషత్తు పోటీల సీజన్ వచ్చిందంటే ఇక ఇల్లూ వాకిలీ వదిలేసి ఊళ్లు పట్టుకు తిరుగుతుంటాడు.

పుష్పకు నాటకాలన్నా.. నాటకాలు వేసేవాళ్లన్నా ఒళ్లు మంట. ఆ విషయం గురించి ఇద్దరి మధ్యా ఎప్పుడూ గొడవలే.. భర్త నాటకాలు మానాలని మొక్కని దేవుడు లేడు.. ఎక్కని గుడి లేదు. ఆఖరికి మాన్పించే ఉపాయం చెబుతారేమోనని పక్కింటి కామేశ్వరి సాయంతో కోయదొరలను... సోది చెప్పే బూదెమ్మలను కూడా ఆశ్రయించాలని నిర్ణయించుకుంది.

"ఏం చేస్తాను పిన్నీ! పెళ్లాంతో కాపురమైనా మానుకుంటాడేమో గానీ! ఆ నాటకాలు ఆడటం మానుకోడేమో"! దిగులుగా చెప్పింది పుష్ప.

"ఇంతమాత్రానికే వాడిపోయిన తిరగమోతలా అయిపోతే ఎలా అమ్మాయ్. ఈ కామేశ్వరి పిన్ని ఉంది. ధైర్యంగా ఉండు.. ఇలాంటి మగాళ్లను ఎలా దారికి తేవాలో నాకు బాగా తెలుసు" అగ్రరాజ్యంలా హామీ ఇచ్చింది కామేశ్వరి.

అదే సమయంలో బాత్‌రూమ్‌లో ఒళ్లు రుద్దుకుంటూ "అసలు నటనంటే నటులంటే వీళ్లకున్న చిన్నచూపు పోగొట్టి తనెంత గొప్ప నటుడో" నిరూపించుకోవాలని గట్టిగా.. ఛాలెంజిగా నిర్ణయించుకున్నాడు ప్రముఖ డ్రామా నటుడైన సుందరబాబు.

* * *

ఆ రోజు ఉదయమే వచ్చాడు సారథి. సారథి, సుంద

రబాబు క్లోజ్ ఫ్రెండ్స్. ఆఫీసులో కొలీగ్స్. మహా ఆప్త మిత్రులయ్యారు.

ఆ విషయం పుష్పకు తెలుసు. కాఫీ సేవిస్తూ కళాహృదయులిద్దరూ చర్చల్లో మునిగిపోయారు. పుష్ప భర్తకు లంచ్ బాక్స్ ప్రిపేర్ చేస్తూ వంటగదిలో బిజీగా ఉంది.

"అమ్మాయ్ పుష్పా... పుష్పా.." అంటూ సరాసరి లోపలికొచ్చింది పక్కింటి కామేశ్వరి. ఆవిడ రాకతో తమ చర్చలకు ఫుల్‌స్టాప్ పెట్టేశారు సుందరబాబు, సారథి.

"ఏం బాబూ.. మళ్లీ ఎక్కడైనా నాటకం వెయ్యాలా?" సాగదీస్తూ అడిగింది ఇద్దర్నీ చూస్తూ కామేశ్వరి.

"మా నాటకాల్ని మరీ అంతగా తీసేయకండి. ఈసారి మా నాటకానికి నందీ అవార్డు ఖాయం" చెప్పాడు సారథి.

"అలాగా! మంచిది నాయనా మీరెంతమంది పిల్లలు? అందరికీ పెళ్లిళ్లయ్యాయా?"

"మా ఏడుగురన్నదమ్ములకీ పెళ్లిళ్లయ్యిపోయాయి. కానీ ఒక్కడు మిగిలిపోయాడండి!"

"ఎవడూ మీ ఆఖరి తమ్ముడా?"

"కాదండి! మా నాన్న. మీ నాన్నగారికే ఇంకా పెళ్లి కాలేదు" చెప్పాడు సారథి. కామేశ్వరి గతుక్కుమన్నది.

"సారీ! ఐ మీన్ మా అమ్మగారు పోయాక ఆయన ఇప్పుడు రెండో పెళ్లికి రెడీ అయ్యాడు లెండి.." వివరించాడు.

"అవునులే బాబూ! ముసలాళ్లకెప్పుడూ దసరా పండగమీదే ధ్యాస... అమ్మాయ్ పుష్పా" అంటూ వ్యంగ్యంగా మూతి విరుస్తూ వంటగదిలోకెళ్లిపోయింది కామేశ్వరి.

"ఎవర్రా ఈవిడ! ఉత్త పశువులా ఉంది" విసుగ్గా అన్నాడు సారథి.

"వాళ్లాయన పశువుల డాక్టర్ దగ్గర కాంపౌండర్‌లే. కంట్రోల్ చేసుకుంటాడు. పుష్పకు కనిపించకుండా ఆ స్క్రిప్ట్ ఇలా తే..." తొందరపెట్టాడు సుందరబాబు.

సారథి తన షర్టులో దాచుకున్న కాగితాల కట్టను బైటకు తీసి సుందరబాబుకి అందించాడు. సుందరబాబు వెంటనే ఆ కాగితాల కట్టను తన షర్టులోపల దాచేశాడు.

ఆ తర్వాత వాళ్లిద్దరూ తిరిగి మాటల్లో పడిపోయారు.

* * *

ఆ రాత్రి...

సుందరబాబు సీక్రెట్‌గా డ్రామా స్క్రిప్ట్ చదువుకుంటుండగా.. పాలగ్లాసుతో బెడ్‌రూమ్‌లోకి అడుగుపెట్టింది పుష్ప. గభాల్న స్క్రిప్ట్ పేపర్స్‌ని పరుపు కింద దాచేశాడు. పుష్ప గమనించి కూడా గమనించనట్లే.

"ఈ పాలు తాగండి" అంది. అప్పుడెప్పుడో పెళ్లయిన కొత్తలో... పది నెలల పాటు వరుసగా పాలు తీసుకొచ్చి ఇచ్చింది. ఈ మధ్యలో ఆ మర్యాద కాస్తా మంటగలిపి.. ఇన్నాళ్లకు తిరిగి తీసుకురావటంలో ఏదో మతలబుందని పించింది.

"ఏంది



పుష్పా! మళ్లీ పాతరోజులు గుర్తుకు వచ్చాయా?" గ్లాసు అందుకుంటూ అడిగాడు.

"అవునండీ! పాత రోజులే బాగున్నాయి. ఎంచక్కా మీరు బోలెడు ముచ్చట్లు చెప్పేవారు. ఇప్పుడలా కాదు నాటకాల గురించే ఆలోచిస్తున్నారు" చెప్పింది.

"ప్లీజ్ అర్థం చేసుకో పుష్ప..నాటకాలు ఆడేవాళ్లందరూ చెడ్డవాళ్లు కారు. ఎంతమంది మహానుభావులున్నారో నీకు తెలియదు. అదో గొప్ప కళ" తన్మయత్వంగా చెప్పుకుపోతున్నాడు.

"తర్వాత చెబుదురు గానీ ముందు పాలు తాగండి.." గోముగా చెప్పింది.

"నువ్వు మరీ అంత గోముగా అడిగితే గ్లాసు పాలేం ఖర్మ. గంగాళం పాలైనా తాగేస్తాను" అంటూ వెంటనే గ్లాసెత్తిపాలు గట..గటా తాగేయసాగాడు.

పుష్ప తృప్తిగా చూసింది. అందులో పక్కింటి కామేశ్వరి పిన్ని ఇచ్చిన మందు కలిపింది. ఈ మందు కలిపిన పాలు తాగితే ఎంత నాటకాల పిచ్చి ఉన్నా వెంటనే తగ్గిపోతుందని గట్టిగా చెప్పింది కామేశ్వరి.

ఆవిడ మాటల మీద నమ్మకంతో గ్లాసు పాలలో మందు కలిపి తెచ్చి భర్త సుందరబాబు చేత తాగించడానికి ధైర్యం చేసింది. తాగటం పూర్తి చేసిన సుందరబాబు, మగతగా ఆవులిస్తూ-

"నాకు నిద్ర ముంచుకొస్తున్నది పుష్పా గుడ్‌నైట్" అంటూ బెడ్‌పై అడ్డంగా పడి నిద్రపోయాడు సుందరబాబు.

"హమ్మయ్యా! ఈ దెబ్బతో ఆ నాటకాల పిచ్చి వదిలిపోతుంది. థాంక్స్ కామేశ్వరి పిన్నీ.." అనుకొని ఆనందంతో చిన్నగా ఈలవేసి మరీ నిద్రకుపక్రమించింది పుష్ప.

సరిగ్గా అర్ధరాత్రి అవుతుండగా...

"అబ్బా పుష్పా..." అంటూ అరిచాడు సుందరబాబు. ఉలిక్కిపడి లేచిన పుష్ప.." అయ్యో ఏమయ్యిందండీ?" అంటూ భర్తను పట్టుకొని కుదిపింది.

అప్పటికే తడుముకుంటూ "పుష్పా... నాకేమీ కనిపించడం లేదు... ఎక్కడ పుష్పా...నువ్వెక్కడా?" అంటూ ఆరాటపడసాగాడు. పుష్ప లేచి లైట్లు వేసింది. సుందరబాబు చేతులతో బెడ్ అంతా తడుముతున్నాడు.

"నేనిక్కడే ఉన్నాను. ఏమైందండీ?" భర్తను పట్టుకుని ఆదుర్దాగా అడిగింది. "నా కళ్లు కనిపించడం లేదు పుష్ప.. అంతా చీకటి.. నల్లని చీకటి.." అంటూ సుందరబాబు అరుస్తున్నాడు.

పుష్పకు ఒక్కసారిగా గుండెలు ఝల్లుమన్నాయి.

"మైగాడ్ మందు వికటించి కళ్లు పోయాయేమో" అనుకుని ఠారెత్తిపోయింది. వెంటనే "అయ్యో... అయ్యో ఎంత ఘోరం జరిగిపోయింది. కామేశ్వరి పిన్నీ... బాబాయ్.." అంటూ గావుకేకలు పెడుతూ పక్కింటికి పరుగులు పెట్టింది.

కామేశ్వరీ... అంజనేయులు పరుగున వచ్చారు. అప్పటికే కంటిచూపు కోల్పోయిన సుందరబాబు దీనంగా.. విలపిస్తూ కనిపించాడు. అంజనేయులు విషయం గ్రహించి ఉగ్రుడైపోయాడు.

"నిజం చెప్పండి! ఈ అమాయకుడి మీద ఏ ప్రయోగం చేశారు?" అడిగాడు.

కామేశ్వరి.. పుష్ప కళ్లల్లోకి భయంగా చూసింది. "పిన్నీ ఏదో మందు తెచ్చి ఇచ్చింది. అది పాలల్లో కలిపి మా వారికి తాగించాను. ఈ మందు తాగిస్తే నాటకాల పిచ్చి పోతుందని చెప్పింది బాబాయ్. కానీ! మా వారి చూపే పోయింది" చెప్పి ఘొల్లున ఏడ్చింది పుష్ప.

"అనుకున్నాను. ఇలాంటి దిక్కుమాలిన ప్రయోగమేదో జరిగే ఉంటుందని అనుకున్నాను. నాకు పేకాట పిచ్చి ఉందని ఇలాగే మా పెళ్లయిన కొత్తల్లో ఏదో పిచ్చి మందు తెచ్చి పాలల్లో కలిపి నాచేత బిందెడు పాలు తాగించింది. అంతే ఆ దెబ్బతో ఆర్నెల్లు హాస్పిటల్లో ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత నాకు తెలీకుండా ఏమేం ప్రయోగాలు చేసి అఘోరించిందో! పిల్లలు పుట్టకుండా పోయారు. దీన్ని అసలు.... ఈ ప్రయోగాలకు శిక్షణ అండమాన్ జైల్లో పెట్టాలి" పాత కోపాన్ని కూడా బైటకు తెచ్చుకుని పళ్లు కొరికాడు అంజనేయులు.

"ఇలా జరుగుతుందని నాకేం తెలుసండీ! పాపం చిలకా గోరింకల్లా ఉండేవారు. పుష్ప ఈ కళ్లు లేని కబోదితో ఎలా కాపురం చేస్తుందండీ" జాలిగా అడిగింది కామేశ్వరి.

"ఇక చాల్లే నీ దరిద్రపు వాగుడు. అమ్మాయ్ పుష్ప. ఆటో తీసుకువస్తాను. అబ్బాయిని హాస్పిటల్‌కు తీసుకు వెళదాం..." చెప్పి వెళ్లిపోయాడు అంజనేయులు.

"నన్ను డాక్టర్ అరవింద్ ఐ హాస్పిటల్‌కి తీసుకువెళ్లండి!" చెప్పాడు సుందరబాబు తడుముకుంటూనే.


"అలాగే తీసుకెళతాంలే గానీ! నువ్వెక్కువగా మాట్లాడకు బాబూ. ఏ జన్మలో చేసిన పాపమో ఇలా జరిగింది. అయినా అమ్మాయ్ నేను మూడుసార్లుగా ఇవ్వనున్న మందు కొంపతీసి ఒకేసారి ఇచ్చావా ఏంది?" బుగ్గలు నొక్కుకుంటూ అడిగింది కామేశ్వరి.

"ఇక చాల్లే ఆపండి.. మీ పిచ్చి మందుల గోల" మండిపడింది పుష్ప. అంతలో అంజనేయులు ఆటో తీసుకు రావడంతో సుందరబాబుని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు.

* * *

ప్రముఖ ఐ స్పెషలిస్ట్ డాక్టర్ అరవింద్ అప్పటికప్పుడే సుందరబాబుని కళ్లకు సంబంధించి అన్ని రకాల టెస్టులూ చేశాడు. ఆ తర్వాత కొన్ని టాబ్లెట్స్, ఐ డ్రాప్స్ రాసిచ్చి..

"మరేం ఫర్వాలేదు. ఇది లక్షమందిలో ఒక్కరికి వచ్చే



## భూమిక లౌక్యం!

ఇటీవల నిర్మాతగా మారి చేతులు కాల్చు కున్న భూమికను- తారలు ముఖ్యంగా హీరోలు తమ భారీ పారితోషికాలను తగ్గించుకుంటేనే సినిమా ఇండస్ట్రీకి మంచిదని నిర్మాతలు భావించడం గురించి ఆమె కామెంట్‌ని అడిగితే- 'అసలు సినిమాలకు హీరోలే కదా మొదటి అట్రాక్షన్. అలాంటప్పుడు డిమాండ్ వున్న హీరోని రెమ్యునరేషన్ తగ్గించుకోమంటే అంత కుదిరేది కాదేమో కదా! అయినా ఎవరికి వాళ్లు ఈ సమస్య పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తే బావుంటుంది' అంటూ తెలివిగా జవాబిస్తోంది.

అరుదైన ఐ ఇన్ఫెక్షన్. దీన్ని త్రీడేస్ బ్లైండ్‌నెస్ అంటారు." చెప్పాడు.

"అంటే?" అర్థంగాక అడిగింది పుష్ప. ఆంజనేయులు, కామేశ్వరి డాక్టర్ వైపు దీనంగా దివాలా తీసిన వాళ్లలా చూడసాగారు.

"అంటే! ఈ ఐ ఇన్ఫెక్షన్ మూలంగా మూడు రోజుల పాటు కళ్లు కనిపించవు. ఆ తర్వాత నాలుగో రోజు ఎలా పోయిందో చూపు అలాగే కరెంట్ స్విచ్ వేస్తే బల్బు వెలిగినట్లుగా వస్తుంది. భయం లేదు. వెంటనే ఇంటికి వెళ్లిపోవచ్చు. కాకపోతే మూడు రోజులు ఇబ్బంది" చెప్పాడు డాక్టర్ అరవింద్.

"మూడు రోజులేం ఖర్మ! ముప్పై రోజులైనా చంటిపిల్లాడిలా చూసుకుంటాం డాక్టర్" చెప్పింది అప్పటిదాకా నోరు మూసుకుని ఉన్న కామేశ్వరి.

"అక్కర్లేదు. మూడు రోజులు చాలు" భయంగా చెప్పాడు అక్కడే ఉన్న సుందరబాబు.

"ఇక బయలుదేరండి" సుందరబాబుని లేవదీశాడు ఆంజనేయులు. డాక్టర్ ఫీజు కూడా తీసుకోకుండా పంపించేశాడు. అందరూ తిరిగి ఆటోలో తెల్లవారుఝాముకి ఇళ్లకు చేరారు.

* * *

సుందరబాబు సిక్ చేసి ఇంట్లోనే ఉండిపోయాడు. ఆ సాయంత్రం పూట మధ్య హాలులో కామేశ్వరి కబుర్లు చెబుతుంటే వింటూ కూర్చుంది పుష్ప.

సుందరబాబుకి దాహం వేసింది. పుష్పకు పిలవాలనుకున్నాడు. ఇబ్బంది పెట్టడం ఎందుకులే? అనుకుని చిన్నగా తడుముకుంటూ బెడ్‌రూమ్‌లోంచి మధ్యహాలులోకి నడుస్తూ అక్కడున్న కుర్చీ తగిలి 'దభీ'మంటూ పడిపోయాడు.

"ఏవండీ..." అంటూ వెర్రికేక వేస్తూ వచ్చి పుష్ప సుందరబాబుని పట్టుకుంది.

"ఏవిటో ఈ గుడ్డి జన్మ.. నిన్ను ఇబ్బంది పెడుతున్నాను పుష్పా!" జాలిగా చెప్పాడు.

"మీరలా అనకండి. నేనే మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను. మీ విలువ తెలియక విసిరికొట్టాను. ఇలా ఈ కుర్చీలో కూర్చోండి" అంటూ తీసుకెళ్లి కుర్చీలో కూర్చోబెట్టింది భర్తనా స్థితిలో చూస్తుంటే పుష్ప హృదయం పశ్చాత్తాపంతో దహించుకుపోతున్నది.

అక్కడే కూర్చొని ఇదంతా గమనిస్తున్న కామేశ్వరి బ్రహ్మానందంతో సంబరపడిపోతున్నది. ఎదుటి వాళ్లతో మంచిగా ఉంటూనే వాళ్లు బాధ పడుతూంటే సైలెంట్‌గా సంబరపడే శాడిస్ట్ మనస్తత్వానికి కామేశ్వరి నిదర్శనం.

ఉన్నట్లుండి సుందరబాబు చివాల్న లేచి నాలుగు అడుగులు వేసి "ఇలా నీ ఒడిలో తల పెట్టుకొని పడుకుంటాను. పుష్ప... అంటూ ఒడిలో తలపెట్టి పడుకున్నాడు అంతే! "కెవ్వు"మంటూ కేకపెట్టింది కామేశ్వరి. "అయ్యో! ఇలా రండీ" అంటూ కామేశ్వరి ఒడిలో తలపెట్టుకు పడుకున్న సుందరబాబుని ఇవతలకు లాగింది పుష్ప.

"చూపుతో పాటు మైండు కూడా పోయిందేమో!" భయంగా చెప్పింది కామేశ్వరి.

"ఛ.. అవేం మాటలు పిన్నిగారూ! ఆయనది పసిపిల్లాడి మనస్తత్వం" భర్తను సమర్థించింది పుష్ప.

ఇంతలో చప్పట్లు వినిపించాయి. కామేశ్వరి, పుష్ప అటువైపు తిరిగారు. వాకిట్లో సారథి.. డాక్టర్ అరవింద్... ఆంజనేయులు నిలుచుని ఉన్నారు"

"రండి డాక్టర్ గారూ.. రండి..." ఆహ్వానించింది పుష్ప. నవ్వుతూ ముగ్గురూ సుందరబాబు దగ్గరకు వచ్చారు.

"ఇంక రెండురోజుల్లో నా కళ్లు వస్తాయిగా డాక్టర్?" అమాయకంగా అడిగాడు సుందరబాబు.

"వాటే వండరల్ యాక్టింగ్ సుందర్..." అభినందించాడు డాక్టర్.

"ఇక చాలు. ఇప్పటికే సూపర్ హిట్" ఉత్సాహం సుందరబాబు భుజం తట్టాడు సారథి.

"అబ్బ.. పండించావయ్యా సుందరం" మెచ్చుకున్నాడు ఆంజనేయులు.

వాళ్ల మాటలేవీ అర్థంగాక అయోమయంగా చూశారు పుష్ప..కామేశ్వరి.

"ఇక సస్పెన్స్‌కి తెరదించుతున్నాం చెల్లెమ్మా! ఇదంతా డ్రామా. పాపం నిజమేననుకుని భయపడిపోయి వుంటావ్" అన్నాడు సారథి.

"అదేంటన్నయ్యా! త్రీడేస్ బ్లైండ్‌నెస్.. చూపు పోవడం?" అర్థంగాక అడిగింది పుష్ప.

"రేపు మేము ఆడబోయే కొత్త నాటికలో నాది గుడ్డివాడి పాత్ర.. ఎలా నటించాను. పుష్పా? మరో విశేషం ఏమిటంటే ఈ అద్భుతమైన నాటిక రాసింది డాక్టర్ అరవింద్" చాలా మామూలుగా హుషారుగా అసలు నిజాన్ని చెప్పాడు సుందరబాబు.

"బాబోయ్.. ఇంత రియల్ డ్రామానా! ఒప్పుకున్నాను గానీ బైట నటించండి. ఇంట్లో నటించి గాభరా పెట్టకండి"

తేలిగ్గా నిట్టూరుస్తూ ఓటమి ఒప్పుకుంది పుష్ప.

విజయగర్వంతో మిత్రుల వైపు చూశాడు సుందరబాబు. అందరి చూపుల్లో అభినందన కురిసింది.

"అయ్యో ఇదంతా నాటకమా? నిజమనుకుని ఎంత సంతోషపడిపోయాను" బాధగా మూలిగింది కామేశ్వరి మనసు.

"ఇక పదవే ఇంటికి! అయినా నీ పిచ్చి కాకపోతే మందులకు అభిరుచులూ... అభినయాలూ.. మారతాయా!" అన్నాడు ఆంజనేయులు. అందరూ హాయిగా నవ్వేశారు.

○

## ఎన్నాళ్లకెన్నాళ్లకి...

*ఖుష్బూ ఒకప్పుడు బాలీవుడ్‌లో బాలతారగా ఆ తర్వాత హీరోయిన్‌గా నటించిన అమ్మాయి. అయితే అక్కడ అదృష్టం కలిసిరాక దక్షిణాదికి వచ్చి తెలుగు, తమిళంలో నటించింది. తమిళనాట ఆమెకి అద్భుతమైన ఆదరణ లభించడంతో తమిళ దర్శకుడు సుందర్‌ని పెళ్లాడి చెన్నయ్‌లోనే సెటిలైపోయింది. ఎంతో కాలానికి ఖుష్బూ ఓ హిందీ చిత్రంలో నటించబోతోంది. అమితాబ్‌కి భార్యగా ఖుష్బూ నటించనున్నట్టు వినికిడి. ఇంత కాలం గ్యాప్ తర్వాత హిందీలో ఆమెకి ఎలాంటి ఆదరణ లభిస్తుందో?*

